మాకెందుకు డబ్బులు పడలేదు?

- మొన్నటి వరకు వచ్చినవి.. ఇప్పుడెందుకు రావడం లేదు
- పీఎం కిసాన్ నగదు జమ కాకపోవడంపై ప్రశ్నిస్తున్న రైతులు
- ఏవో కార్యాలయంలో రోజుకొకరుంటున్నారు
- ఎవరిని కలిసినా రేపు రమ్మంటున్నారు
- పెడన వ్యవసాయ శాఖ తీరుపై రైతుల ఆగ్రహం


పెడన ఏవో కార్యాలయంలో సిబ్బందిని పీఎం కిసాన్ గురించి ప్రశ్నిస్తున్న రైతులు

పెడన: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉన్న సమయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా పీఎం కిసాన్ నిధులు నేరుగా బ్యాంకు ఖాతాలకు జమ అయ్యేవి. ఇప్పుడు ఎందుకు జమ కావడం లేదంటూ రైతులు పెడన మండల వ్యవసాయ శాఖాధికారులను ప్రశ్నిస్తున్నారు. ఆన్‌లైన్‌లో తప్పులు, పేర్లు పోవడం, ఖాతాలు మారిపోవడం వంటి కారణాలున్నాయా అంటే తెలియదని, ఏమైందో చూస్తామని, రేపు రండంటూ సమాధానం ఇచ్చి పంపించేస్తున్నారు. తీరా మరుసటి రోజు వెళ్తే ఆ సీటులో మరొకరుంటున్నారు. నిన్న వచ్చామండీ, ఈ రోజు రమ్మన్నారు... అని కొందరు రైతులు ధైర్యం చేసి అడుగుతున్నారు. మరికొందరు రైతులు నిన్న సమాధానం ఇచ్చిన వారు ఎప్పుడు వస్తారా అంటూ ఏవో కార్యాలయం వద్ద పడిగాపులు పడుతున్నారు.

ఏవో కార్యాలయంలో రోజుకు ఇద్దరు వీఏఏలు

ఏవో కార్యాలయంలో మండలంలో విధులు నిర్వహిస్తున్న వీఏఏలు, ఏఈవోలు తాము చేసే రైతు సేవా కేంద్రాలకు తాళాలు వేసి నియోజకవర్గ కేంద్రమైన పెడన మండలం ఏవో కార్యాలయంలో విధులు నిర్వహించాలి. ఈ విధంగా రోజుకు ఇద్దరు చొప్పున వీఏఏలు ఏవో కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ రైతులకు అందుబాటులో ఉంటున్నారు. ఇన్‌చార్జి ఏవో నూరున్నీసా పెడనకు వస్తే వచ్చినట్లు, లేకుంటే లేదు. ఇటీవల ఆమె తరచుగా సెలవులు పెడుతుండటంతో పెడన వ్యవసాయశాఖ గాడి తప్పుతుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పీఎం కిసాన్ ఎంత మందికి వచ్చింది..

కేంద్ర ప్రభుత్వం రైతులకు మూడు విడతలుగా అందిస్తామన్న సాయం పీఎం కిసాన్ పథకం. ఈ పథకం ద్వారా నెల రోజుల కిందట కేంద్రం రూ.2వేలను రైతుల ఖాతాలకు జమ చేసింది. అయితే కొందరు తమకు పీఎం కిసాన్ నిధులు జమ కాకపోవడంపై పెడన ఏవో కార్యాలయాన్ని సంప్రదిస్తున్నారు. కాని ఏవో కార్యాలయంలో సమాధానం చెప్పేవారే కరువయ్యారు. వీఏఏలు ఉన్నా కంప్యూటర్‌లో చూసి పేరు లేదని మాత్రమే చెబుతున్నారు. అంతకుముందు వరకు వచ్చిందని, ఇప్పుడు ఎందుకు ఆగిందనే విషయాన్ని ప్రశ్నిస్తే ఏవో లేరు...వారొచ్చిన తరువాత రండి అంటూ రైతులకు సమాధానం చెప్పి పంపిస్తున్నారు. మరికొందరు రైతుల నుంచి లిఖితపూర్వకంగా లెటర్లు తీసుకుంటున్నారు. ఇలా ఇప్పటికే వందల సంఖ్యలో లెటర్లు సమర్పించినట్లుగా తెలుస్తోంది. అయితే ఎంతమంది లిఖితపూర్వకంగా ఇచ్చారనే దానిపై కూడా స్పష్టత లేదు. ఉన్నతాధికారులు స్పందించి పెడన రైతుల పీఎం కిసాన్ ఇబ్బందులను తొలగించేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

పథకాలన్నీ అమలు చేస్తాం: కాగిత


లేళ్లగరువులో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్

గూడూరు: గత సార్వత్రిక ఎన్నికలలో హామీ ఇచ్చిన పథకాలన్నీ అమలు చేస్తామని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ తెలిపారు. మండలంలోని లేళ్లగరువులో చేపట్టిన అంతర్గత రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కాగిత గురువారం సాయంత్రం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం సూపర్ సిక్స్ పథకాలలోని ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని దీపావళి నుంచి అమలు చేస్తున్నామన్నారు. రానున్న కాలంలో మిగిలిన పథకాలు కూడా అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచి నరహరశెట్టి మానస, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పచ్చదనాన్ని పెంపొందిద్దాం

జేసీ గీతాంజలిశర్మ

చిలకలపూడి(మచిలీపట్నం): కలెక్టరేట్ ప్రాంగణంలో పచ్చదనాన్ని పెంపొందించి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ అన్నారు. స్వచ్ఛ కలెక్టరేట్ ప్రతినిధి, డీఆర్వో సీసీ తూము వెంకటేశ్వరరావు సారథ్యంలో కలెక్టరేట్ ప్రాంగణంలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండు వేల ఎరుపు, పసుపు ముద్ద బంతి మొక్కలను నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఆర్వో బి.శ్రీదేవి, ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు, కలెక్టరేట్ ఏవో సీహెచ్ వీరాంజనేయప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఎంవీ శ్యామ్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

కాలం చెల్లిన పదార్థాలను విద్యార్థులకు పెట్టొద్దు

డీఈవో రామారావు


సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో రామారావు

మచిలీపట్నంటౌన్: పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు కాలం చెల్లిన ఆహార పదార్థాలను పెట్టొద్దని జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు ప్రధానోపాధ్యాయులను హెచ్చరించారు. స్థానిక రుస్తుంబాద బాలికల నగరపాలక సంస్థ హైస్కూల్‌లో గురువారం నియోజకవర్గంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా కృషి చేయాలని సూచించారు. ఉపాధ్యాయులందరూ ప్రతిరోజు 9 గంటల్లోపే పాఠశాలలకు చేరుకుని బయోమెట్రిక్ వేయాలని, పాఠశాల ముగిసిన అనంతరం కూడా బయోమెట్రిక్ నమోదు చేయాలన్నారు. విద్యార్థులందరికీ ఏపీ ఏఏఆర్ ఐడీ ని రూపొందించాలని, సీసీఈ మార్కులను వెంటనే అప్‌లోడ్ చేయాలని, పరీక్షలు పూర్తయిన వెంటనే జవాబు పత్రాలను వెంటనే దిద్దాలని ఆయన సూచించారు. సమావేశంలో ఎంఈవోలు దుర్గాప్రసాద్, గురుప్రసాద్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా ఆషాలత బాధ్యతల స్వీకారం

మచిలీపట్నంటౌన్: జిల్లా సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా ప్రొఫెసర్ డాక్టర్ డి.ఆషాలతను నియమిస్తూ రాష్ట్ర మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరసింహం బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె గురువారం సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆషాలత ప్రస్తుతం మచిలీపట్నం ప్రభుత్వ మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. 2023 ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కూడా ఈమె జీజీహెచ్ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఈమెకు సూపరింటెండెంట్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ డైరెక్టర్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆషాలతకు ఆసుపత్రి వైద్యులు, వైద్యసిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

క్లుప్తంగా

ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి

కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో కొత్తగా ఓటర్ల నమోదు కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9, 10, 23, 24 తేదీల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో బూత్ లెవల్ అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. 2025 జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండే వారు ఓటరుగా నమోదు చేసుకోవచ్చునన్నారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ స్థాయి ఏజెంట్లతో కలిసి ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉంటారన్నారు.

పోటీల్లో రాణించి జిల్లాకు పేరు తీసుకురండి

మచిలీపట్నంటౌన్: జాతీయ, రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ డీకే బాలాజీ ఆకాంక్షించారు. డీఎస్‌డీవో ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన నగరానికి చెందిన ఐదుగురు యోగా సాధకులు రమేష్, మధు, శ్రీనివాస్, స్వర్ణలత, సునంద లను కలెక్టర్ గురువారం అభినందించారు. గాంధీనగర్ ఉదయపు నడక మిత్ర మండలి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం

పెదకళ్లేపల్లి(మోపిదేవి): మండలంలోని పెదకళ్లేపలిలో ఇటీవల అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులు గంధం చలపతిరావు, కోళ్ల నాగేశ్వరమ్మకు రెడ్‌క్రాస్ సంస్థ చేయూతనిచ్చింది. జిల్లా శాఖ సమకూర్చిన వంట పాత్రలు, నిత్యావసర సరుకులు, కూరగాయలు, బియ్యం అందజేశారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సభ్యులు, గ్రామ సర్పంచ్ అరజా సంధ్యారాణి, ఎంపీటీసీ సభ్యురాలు ఆశాదేవి, జిల్లా శాఖ కార్యదర్శి భవిరి శంకర్ నాథ్, కన్వీనర్ కొండపల్లి కృష్ణతేజ, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కడవకొల్లు సీతారామాంజనేయులు, గ్రామ కార్యదర్శి ఎం.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఉల్లాస్ శిక్షణకు 350 మంది గుర్తింపు

నాగాయలంక: వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో గ్రామ సంఘాల సభ్యులకు నాగాయలంక వెలుగు కార్యాలయంలో గురువారం ఉల్లాస్ (యూఎల్ఎల్ఏఎస్)శిక్షణ కార్యక్రమం ఎంపీడీఓ జె.కె.ఎస్.రామ్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సహాయక సంఘాలలో చదువు ఆపేసిన వారిని, నిరక్షరాస్యులైన పెద్దలను మండలంలో 350 మందిని గుర్తించామని, ఫిబ్రవరి 25 వరకు శిక్షణ కొనసాగుతుందన్నారు. వెలుగు ఏపీఎం కె.వై.దాస్ 35 మంది అభ్యాసకులకు శిక్షణ ఇచ్చారు. ఎంఈఓ-2 అన్నపరెడ్డి రామారావు, డ్వాక్రా మహిళలు, మండల సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

నగరంలో ఆక్రమణల తొలగింపు

మచిలీపట్నంటౌన్: నగరంలోని మూడు స్తంభాల సెంటర్ అన్న క్యాంటీన్ సమీపంలో పుట్లమ్మచెరువు ప్రహరీ వెంబడి ఉన్న ఆక్రమణలను నగరపాలక సంస్థ అధికారులు గురువారం తొలగించారు. ఆ ప్రాంతంలో ఇకపై ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవని కమిషనర్ బాపిరాజు హెచ్చరించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న ఆక్రమణలను ప్రాధాన్యతా క్రమంలో తొలగిస్తామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో టీపీఎస్ హరిప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సీవీ రామన్ జయంతి

కృత్తివెన్ను: సైన్సే నా మతం జీవితాంతం దాన్నే ఆచరిస్తానని చెప్పిన విజ్ఞాన గని సీవీ రామన్ అని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొప్పినేటి సూర్యప్రకాష్ అన్నారు. గురువారం రామన్ జయంతిని పురస్కరించుకుని మండలంలోని పల్లెపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సీవీ రామన్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఏసుపాదం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ములకు గాయాలు

చల్లపల్లి(అవనిగడ్డ): చల్లపల్లి మండల పరిధిలోని వెలివోలులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లక్ష్మీపురం పంచాయతీ శివారు రామానగరానికి చెందిన మేకా భానుప్రకాష్, శశిధర్ అనే ఇద్దరు అన్నదమ్ములు గాయాలపాలయ్యారు. కారు డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకులు మేకా భాస్కర్ కుమారులైన వీరిద్దరూ ద్విచక్ర వాహనంపై విజయవాడ వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో గాయాల పాలయ్యారు. వెంటనే వారిని చల్లపల్లి వైద్యశాలకు తరలించగా చికిత్సఅనంతరం మెరుగైన చికిత్స కోసం విజయవాడ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, టీడీపీ నాయకుడు మేడికొండ రవి చల్లపల్లి వైద్యశాలలో క్షతగాత్రులను పరామర్శించి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

విద్యుత్ చార్జీల తగ్గింపునకు చర్యలు తీసుకోండి

చిలకలపూడి(మచిలీపట్నం): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపిందని వీటిని ఉపసంహరించుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొల్లు కృష్ణ కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మకు గురువారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అబ్దుల్ మతీన్, కోకా శశిభూషణ్, మొవ్వా మోహనరావు పాల్గొన్నారు.

- **శాస్త్రవేత్తలకు ఘన నివాళి**

కోనేరుసెంటర్: భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రంలలో నోబెల్ పురస్కారం పొందిన ఏకైక మహిళ మేడమ్ క్యూరి అని కృష్ణా విశ్వవిద్యాలయం రెక్టార్ ఆచార్య ఎంవీ బసవేశ్వరరావు కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ సైన్స్ అకాడమీ, కృష్ణా విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో మేడం క్యూరీ, సీవీ రామన్, ఆచార్య ఎన్జీ రంగా జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సుందర కృష్ణ, మారుతి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ రాంబాబు, పరీక్షల నియంత్రణ అధికారి వీర బ్రహ్మచారి, రాజశేఖర్ రెడి తదితరులు పాల్గొన్నారు.

- **నైపుణ్య సర్వేపై శిక్షణ తరగతులు**

ఘంటసాల: ఘంటసాల మండలంలో నిర్వహించనున్న నైపుణ్య సర్వేపై శిక్షణ తరగతులను గురువారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షకులు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో 15 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన వారి విద్యార్హత, నైపుణ్యాలు, తదితర అంశాలను యాప్ ద్వారా ఇంటింటికీ వెళ్లి సర్వే చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో కేజే శ్రీనివాస చంద్, కోఆర్డినేటర్ దిలీప్, ట్రైనర్లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

- **డాక్టర్ వేమూరికి సత్కారం**

ఘంటసాల: గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఘంటసాల పంచాయతీ వద్ద జరిగిన ఆచార్య ఎన్జీ రంగా జయంతి వేడుకల సందర్భంగా ఘంటసాల పీహెచ్‌సీలో వైద్య సేవలందిస్తున్న డాక్టర్ వేమూరి ప్రమోద్ కుమార్‌ను ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు.

- **సమగ్ర బాలల సంరక్షణపై అవగాహన**

అవనిగడ్డ: స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం, వేకనూరు పీహెచ్‌సీలో సమగ్ర బాలల సంరక్షణపై గురువారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వేకనూరు పీహెచ్‌సీ డాక్టర్ రాహుల్ మాట్లాడుతూ బాలల సంరక్షణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సీడీపీవో శేషుకుమారి మాట్లాడుతూ బాల్య వివాహాల నిరోధక చట్టం, బాలల భిక్షాటన, బాల కార్మిక వ్యవస్థ వల్ల కలిగే అనర్థాలు, లైంగిక వేధింపు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ నిర్వాహకులు సూరిబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, డీఎస్సీ అభ్యర్థులు పాల్గొన్నారు.

- **కషాయ ద్రావణాలపై అవగాహన**


కోనేరుసెంటర్: మండల పరిధిలోని చిన్నాపురం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం ఆధ్వర్యంలో గురువారం ప్రకృతి వ్యవసాయ కషాయాలపై మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీపీఎం నాగమల్లేశ్వరి, ఏఎఫ్ఏలు నగేష్, గంగరాజు, మహిళలు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

- **జీవన ఎరువులతో అధిక లాభాలు**

దేవరకోట(ఘంటసాల): జీవన ఎరువులతో తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందవచ్చునని ఘంటసాల కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి అన్నారు. ఘంటసాల మండలం దేవరకోటలో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్ర ఆధ్వర్యంలో జీవన ఎరువులు - వ్యవసాయంలో వాటి ప్రాముఖ్యత గురించి రైతులకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కేవీకే సస్య పోషణ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.వెంకట లక్ష్మి, కేవీకే సస్య రక్షణ శాస్త్రవేత్త డాక్టర్ కె.రేవతి, వీఏఏ బి.సత్యదేవ్, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

- **రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఇరువురు విద్యార్థుల ఎంపిక**



తలగడదీవి(నాగాయలంక): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 9, 10, 11 తేదీలలో బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెంలో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు కృష్ణాజిల్లా జట్టులో స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఇరువురు హాజరు కానున్నట్లు పాఠశాల హెచ్ఎం కె.రాధాకుమారి గురువారం తెలిపారు. పాఠశాలలో 8, 9 తరగతులు చదువుతున్న తోట కీర్తన, చిక్కాల బాలవంశీ గత నెల 22న జగ్గయ్యపేటలో జరిగిన పోటీల్లో కృష్ణాజిల్లా జట్టుకు ఎంపికయ్యారు.

- **104 సిబ్బంది డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ వినతి**

ఘంటసాల: పెండింగ్‌లో ఉన్న మూడు నెలల జీతాలు ఇప్పించడంతో పాటు 104 సిబ్బంది డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఘంటసాల 104 సిబ్బంది గురువారం తహసీల్దార్ బి.విజయ ప్రసాద్, ఇన్‌చార్జి ఎంపీడీవో కేజే శ్రీనివాస చంద్‌లకు వినతిపత్రాలు సమర్పించారు. 104 ఉద్యోగులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

- **రేపు స్వచ్ఛ సుందర చల్లపల్లి పదేళ్ల వేడుక**

చల్లపల్లి(అవనిగడ్డ): స్వచ్ఛసుందర చల్లపల్లి పదేళ్ల వేడుక కార్యక్రమం ఈనెల 9వ తేదీన జరుగుతుందని నిర్వాహకులు డాక్టర్ డీఆర్కే ప్రసాద్ - పద్మావతి దంపతులు తెలిపారు. ఉదయం 4.30 గంటలకు పద్మావతి హాస్పిటల్ రోడ్డులో స్వచ్ఛభారత్ కార్యక్రమం జరుగుతుందని, అనంతరం స్వగృహ ఫంక్షన్ హాలు వరకూ ర్యాలీ ఉంటుందని చెప్పారు. అనంతరం జరిగే సభకు స్థానిక శాసన సభ్యుడు మండలి బుద్ధప్రసాద్, శాంతా బయోటెక్స్ చైర్మన్ డాక్టర్ కె.వరప్రసాద్ రెడ్డి, కిమ్స్ హాస్పిటల్ నిర్వాహకుడు డాక్టర్ ఏవీ గురవారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమానికి స్వచ్ఛసుందర చల్లపల్లి కార్యకర్తలతో పాటు స్వచ్ఛసుందర చల్లపల్లికి తోడ్పాటు నందించే ప్రతి ఒక్కరూ రావాలని కోరారు.

- **వాహనదారులకు నిబంధనలపై అవగాహన**

కోనేరుసెంటర్: జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు జిల్లా పోలీసులు విజుబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్నారు. వాహనదారులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కలిగించటంతో పాటు రోడ్డు భద్రత చర్యలపై వివరించేలా జిల్లా ఎస్పీ గంగాధర్ రావు ఆదేశాల మేరకు జిల్లా పోలీసు యంత్రాంగం వాహనదారులకు అనేక విధాలా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. అందులో భాగంగా జిల్లాలోని నగరాలు, పట్టణాలు, గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తూ వాహనదారులకు ట్రాఫిక్ సిగ్నల్స్, సీటు బెల్టు, హెల్మెట్ వినియోగంపై వివరించటంతో పాటు అతివేగం వలన కలిగే అనర్థాలపై అవగాహన కలిగిస్తున్నారు. మద్యం తాగి వాహనాలు నడపటం వలన కలిగే దుష్ప్రయోజనాలు, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే జరిగే నష్టం తదితర అంశాలపై చైతన్యపరుస్తున్నారు.

- **10న చాంబర్ ఆఫ్ కామర్స్ కార్తిక సమారాధన**

మచిలీపట్నంటౌన్: కృష్ణాజిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ ఆదివారం మచిలీపట్నంలో నిర్వహించనున్న కార్తిక సమారాధన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘ అధ్యక్షుడు మద్దుల గిరీష్ కుమార్ కోరారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు చిట్టిపాలెం రోడ్డులోని సత్య కన్వెన్షన్ సెంటర్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. అనంతరం జరిగే ఆత్మీయ అభినందన సభలో వ్యాపార రంగంలో అత్యున్నత స్థాయికి ఎదిగిన ఆర్కే సంస్థల అధినేత బండి రామకృష్ణ, గోల్డ్ ప్రిన్స్ అధినేత చలమలశెట్టి నరసింహారావు వ్యాపారులకు దిశా నిర్దేశం చేస్తారన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఏపీ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు తదితర ప్రజా ప్రతినిధులు హాజరవుతారని ఆయన తెలిపారు.

- **వరద సామగ్రి వితరణ చేసిన ఓఎన్‌జీసీ**

చిలకలపూడి(మచిలీపట్నం): వరద బాధితులను ఆదుకునేందుకు ఓఎన్‌జీసీ సంస్థ స్వచ్ఛందంగా ముందుకు రావటం ఎంతో అభినందనీయమని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. గురువారం సాయంత్రం ఆయన చాంబర్‌లో ఓఎన్‌జీసీ ప్రతినిధులు కలెక్టర్‌ను కలిసి రూ.11.78 లక్షల విలువ చేసే సామగ్రిని అందజేశారు. వరదల సమయంలో ఉపయోగపడే లైఫ్ జాకెట్లు, సిగ్నల్ లైట్లు, డ్రాగన్ లైట్లు, హ్యాండ్ మైకులు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ వరద సమయాల్లో రక్షణ పరికరాలను అందించిన ఓఎన్‌జీసీని అభినందించారు. కార్యక్రమంలో ఓఎన్‌జీసీ హెచ్ఆర్ రామారావు, సపోర్టు మేనేజర్ శ్రీనివాస్, సీఈవో గణేష్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆచార్య ఎన్జీ రంగాకు ఘన నివాళి


ఘంటసాల కేవీకేలో ఎన్జీ రంగా జయంతి సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

ఘంటసాల: రైతు కూలీ శ్రమరాజ్యం కోసం తపించిన మహోన్నత వ్యక్తి ఆచార్య ఎన్జీ రంగా అని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో, పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం ఆచార్య ఎన్జీ రంగా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో ఆచార్య ఎన్జీ రంగా, కిసాన్ గొర్రెపాటి వెంకట సుబ్బయ్య విగ్రహాలకు జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి రామకృష్ణ ఆధ్వర్యంలో, కృషి విజ్ఞాన కేంద్రంలో ఎన్జీ రంగా చిత్రపటానికి కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సత్యప్రియలలిత, మాజీ ఏఎంసీ చైర్మన్ తుమ్మల చౌదరిబాబు, సర్పంచ్ బి.వెంకటేశ్వరమ్మ, ఉప సర్పంచ్ అయినపూడి భాను ప్రకాష్, తహసీల్దార్ బి.విజయ ప్రసాద్, కేవీకే, ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు, బాపట్ల వ్యవసాయ కళాశాల రావెప్ విద్యార్థినులు, ఘంటసాల వ్యవసాయ పాలిటెక్నిక్ కాలేజ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ముందస్తు పరీక్షలతో క్యాన్సర్ నుంచి రక్షణ


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో గీతాబాయి

మచిలీపట్నంటౌన్: ముందస్తు పరీక్షలతో క్యాన్సర్ నుంచి రక్షణ పొందవచ్చునని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జి.గీతాబాయి అన్నారు. ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని డీఎంహెచ్ఓ గీతాబాయి జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి ప్రధాన రహదారి గుండా సాగింది. ర్యాలీలో ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థులు, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొని ప్లకార్డులను ప్రదర్శించారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ

నాగాయలంక: క్యాన్సర్ అవగాహన మాసోత్సవ దినం సందర్భంగా గురువారం స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో నాగాయలంక ప్రధాన వీధుల్లో క్యాన్సర్ అవగాహన ర్యాలీ జరిపారు. ఈ సందర్భంగా ప్రధాన ట్రాఫిక్ ఐలెండ్‌లో పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ వి.శివరామకృష్ణ, డాక్టర్ ఎం.ఇంద్రకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ముందస్తు పరీక్షలు క్యాన్సర్ నుంచి రక్షణ కలిగిస్తాయని, స్క్రీనింగ్‌తో క్యాన్సర్‌పై విజయం సాధ్యమన్నారు. 10 సంవత్సరాలు ప్రతి పౌరునికి ఇంటి వద్దనే ప్రభుత్వం ఉచితంగా పరీక్షలు చేస్తుందని ప్రతిఒక్కరూ ఇలాంటి సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ ఎస్.శివయ్య, ల్యాబ్ టెక్నీషియన్ పి.శివ, ఎంఎల్‌హెచ్‌పీఎస్‌లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

సార్వా వరి కోతలు ప్రారంభం

బంటుమిల్లి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో వెద జల్లిన భూముల్లో వరి కోతలు గత రెండు రోజులుగా జరుగుతున్నాయి. అర్తమూరు, నాగేశ్వరరావుపేట, ములపర్రు తదితర గ్రామాల్లో దాదాపు 5 వేల ఎకరాల్లో రైతులు వెద పద్ధతిని అవలంబించారు. దీంతో దమ్ము పొలాల కన్నా వెద పొలాలు సుమారు 20 రోజులు ముందుగా కోతకు వస్తాయి. దీపావళి పండుగ తర్వాత కోతలు చేపట్టడం ఆనవాయితీ. ఈ క్రమంలో పండుగ వెళ్లి వాతావరణం అనుకూలంగా ఉండటంతో రైతులు కోతలు చేపట్టారు. ఇప్పటికే ఏజెంట్లు నెల్లూరు ప్రాంతం నుంచి పెద్ద ఎత్తున వరికోత మిషన్లను మండలంలోకి దిగుమతి చేశారు.

రెండో పంటపై వీడని సందిగ్ధం

దాళ్వాపై ప్రభుత్వం ఎటువంటి సమాచారం ఇవ్వకపోవడంతో రైతుల్లో అయోమయం నెలకొంది. దాళ్వా లేకపోతే మినుము విత్తనాలు నానబెట్టి కోతకు ముందు పంటపైనే చల్లి కోత ప్రారంభిస్తారు. ఈ స్థితిలో మినుము విత్తనాలు కొనాలా.. వద్దా అనే సందిగ్ధంలో రైతులున్నారు. దాళ్వాపై ఇరిగేషన్, వ్యవసాయ శాఖల అధికారులు ఏమీ సమాచారం ఇవ్వలేకపోతున్నారు. ప్రభుత్వం రెండో పంటకు సాగునీరు ఉందా లేదా అనేది వెంటనే ప్రకటించాలని రైతులు కోరుతున్నారు.

సుబ్బారాయుడికి దాతల కానుకలు


మోపిదేవి ఆలయంలో బంగారు చైన్ అందజేస్తున్న శివనాగమల్లేశ్వరరావు కుటుంబ సభ్యులు; లక్ష నగదు అందిస్తున్న దాత శంకరం

మోపిదేవి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న మోపిదేవి శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి గురువారం దాతలు కానుకలుగా బంగారు చైన్, నగదు సమర్పించారు. హైదరాబాద్ వాస్తవ్యులు ధూళిపూడి శివ నాగమల్లేశ్వరరావు 24 గ్రాముల బరువు గల సుమారు రూ.లక్ష 90 వేల విలువ గల బంగారు చైన్ కానుకగా సమర్పించారు. మరోదాత హైదరాబాద్ వాస్తవ్యుడు బులుసు శంకరం స్వామివారి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదానంకు రూ.లక్ష విరాళంగా ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణకు అందజేశారు. ఈ సందర్భంగా దాతల కుటుంబ సభ్యులను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

650 మంది విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు

నాగాయలంక: బొండాడ గ్రూప్(హైదరాబాద్) వారి ఆర్థిక సౌజన్యంతో, స్థానిక సుదర్శి మానవతా సేవా సంస్థ ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రి(విజయవాడ) ఆధ్వర్యంలో మండలంలోని ఏటిమొగ, నాగాయలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఏటిమొగ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఎల్.వి.ప్రసాద్ కంటి ఆసుపత్రి నిపుణులు మొత్తం 650మంది విద్యార్థులకు కంటి పరీక్షలు జరిపారు. వారిలో 120 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. ఈనెల 29న శ్రీరామపాదక్షేత్రం ఫుడ్‌కోర్టు భవనం వద్ద ఈ 120మంది విద్యార్థులతో కలిపి మొత్తం 400 మందికి ఉచితంగా నాణ్యమైన కళ్లజోళ్లు అందిస్తామని సుదర్శి సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్, బొండాడ గ్రూప్ ప్రతినిధి వంగర శేషగిరిరావు చెప్పారు.

దాళ్వాసాగుకు నీరిచ్చి ఆదుకోవాలి

కృత్తివెన్ను: రెండవ పంట అయిన రబీ (దాళ్వా) సాగుకు ప్రభుత్వం నీరిచ్చి ఆదుకోవాలని మండలంలోని రైతులంతా ముక్తకంఠంతో కోరుతున్నట్లు రైతు సంఘం జిల్లా కార్యదర్శి గొరిశెట్టి నాగేశ్వరరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో మండలంలోని మునిపెడ, నీలిపూడి, కొమాళ్లపూడి, సీతనపల్లి, కృత్తివెన్ను, యండపల్లి, అడ్డపర్ర గ్రామాలలోని రైతులను కలవగా వారంతా దాళ్వాకు సాగునీరు ఇవ్వాల్సిందేనని కోరారని తెలిపారు. దాళ్వాకు నీరివ్వకపోతే తరువాత ఖరీఫ్‌కు కూడా భూముల సారం తగ్గి రైతులు నష్టపోతారన్నారు. దీనిపై జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు సానుకూలంగా స్పందించి దాళ్వాకు సాగునీరివ్వాలని ఆయన కోరారు.

పట్టభద్రుల ఓటర్లకు 1558 దరఖాస్తులు

కోడూరు: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటుకు సంబంధించి మండలంలో 1558 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తహసీల్దార్ శ్రీను నాయక్ గురువారం తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా 939 మంది, ఆఫ్‌లైన్ ద్వారా 619 మంది దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. మొత్తం 1558 దరఖాస్తులురాగా వీటిలో 1219 మంది దరఖాస్తుల పరిశీలన పూర్తయిందని, మిలిగిన 339 దరఖాస్తులు పరిశీలించాల్సి ఉందని తహసీల్దార్ చెప్పారు.

- **ముగిసిన పట్టభద్రుల ఓటర్ల నమోదు**

మోపిదేవి: పట్టభద్రుల ఓటర్ల నమోదు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ బుధవారంతో ముగిసినట్టు తహసీల్దార్ శ్రీవిద్య గురువారం తెలిపారు. అక్టోబర్ 1 నుంచి నవంబర్ 6వ తేదీ వరకు దరఖాస్తులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో స్వీకరించినట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన గడువులోగా ఆన్‌లైన్‌లో 627, ఆఫ్‌లైన్‌లో 660 మొత్తం 1,287 దరఖాస్తులు వచ్చినట్లు వివరించారు.